క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుభాష్‌నగర్: ఉషాముళ్లపూడి 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ ఫీడర్ల నిర్వహణ నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని గాజులరామారం ఏఈ సత్యనారాయణ ఓ ప్రకటనలో తెలియజేశారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, కైలాస్‌హిల్స్, షిర్డీ హిల్స్, మహదేవపురం ప్రాంతాలకు బ్యాక్‌ఫీడింగ్ సప్లై ఉంటుందని, ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని ఏఈ కోరారు.

నేడు ఫ్లైఓవర్ పనులను పరిశీలించనున్న ఎమ్మెల్యే

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి జంక్షన్‌లో జరుగుతున్న రోడ్డు విస్తరణ, ఫ్లైఓవర్ నిర్మాణ పనులను శనివారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే వివేకానంద్ పరిశీలించనున్నారు. మేయర్ కొలన్ నీలారెడ్డి, డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్ ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు.

నేడు బీజేపీ కార్యకర్తల సమ్మేళనం

రంగారెడ్డినగర్: బీజేపీ సంఘటన్ మహా విస్తార్ అభిమాన్‌లో భాగంగా శనివారం గాజులరామారంలోని సత్యగౌరి కన్వెన్షన్‌లో బీజేపీ బూత్ కార్యకర్తల సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే ఈ సమ్మేళనానికి బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ సందర్భంగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ వర్చువల్‌గా కార్యకర్తలతో మాట్లాడనున్నారు.

11న 'సాక్షి' ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సుభాష్‌నగర్ డివిజన్ పరిధిలోని అపురూప కాలనీలో 'సాక్షి'ఆధ్వర్యంలో టీవీఆర్ మోడల్ హైస్కూల్ సౌజన్యంతో ఈ నెల 11న సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు పోటీలు జరుగుతాయని, ఔత్సాహికులు ఎవరి ముగ్గులు వారే తెచ్చుకోవాలని నిర్వాహకులు తెలిపారు. విజేతలకు బహుమతులు అందిస్తామని, వివరాలకు 7993839360 నెంబరులో సంప్రదించాలని వారు సూచించారు.

ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్



నమూనాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

నిజాంపేట్: నిజాంపేట్‌లోని రాయల్ మోడల్ స్కూల్‌లో శుక్రవారం సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నిజాంపేట్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లి మాధవి, టీడీపీ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు కొలన్ నరసింహారెడ్డి, ట్రస్మా మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు శివరాత్రి యాదగిరి హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు తాము రూపొందించిన నమూనాల పనితీరును వివరిస్తూ ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ ఝాన్సీరాణి, వైస్ ప్రిన్సిపాల్ పర్వీన్, ప్రైవేట్ స్కూల్స్ మండల అధ్యక్షుడు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతులు చేపడతాం



వివేకానందనగర్‌లో దెబ్బతిన్న రోడ్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సబిహాబేగం

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ వివేకానందనగర్‌లోని రోడ్డు నెంబర్2లో ఉన్న ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం నుంచి మురళీ కృష్ణ నిలయం వరకు శుక్రవారం స్థానిక కార్పొరేటర్ సబిహా బేగం పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా స్థానికులు డ్రైనేజీ లైన్‌లు వేయడంతో రోడ్లు దెబ్బతిన్నాయని, దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోందని ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానని ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రవీందర్‌రెడ్డి, ప్రసాద్‌రావు, రామారావు, సూర్యనారాయణ స్వామి, కొండల్‌రావు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ బ్యాంక్ కాలనీలో 1007 సర్వే నెంబర్లో అక్రమంగా నిర్మించిన భారీ షెడ్లను శుక్రవారం జీహెచ్‌ఎంసీ మూసాపేట సర్కిల్ పట్టణ ప్రణాళిక సిబ్బంది కూల్చివేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

హడలెత్తిస్తున్న 'సాఫ్ట్' చోరీలు

- రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాలు
- అత్యాశ, అవగాహన రాహిత్యమే కారణమంటున్న పోలీసులు



జీడిమెట్ల: మనం చేసే చిన్న పొరపాటును ఆసరాగా చేసుకొని సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. కష్టపడి సంపాదించి బ్యాంకులో దాచుకున్న సొమ్మును క్షణాల్లో మాయం చేస్తున్నారు. దీనికి ప్రధాన కారణం అవగాహన లోపంతో పాటు కొందరి అత్యాశ అని పోలీసులు చెబుతున్నారు. ఇటీవల కాలంలో సైబర్ నేరగాళ్లు స్మార్ట్ ఆలోచనలతో ప్రజల సొమ్ముకు గాలం వేస్తున్నారు. మన చేతిలో ఉన్న మొబైల్ ఫోన్‌తో మనం చేసే పొరపాటు కారణంగా ఖాతా ఖాళీ అయ్యే ప్రమాదం ఉంది. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని పోలీసులు ఎంత చెబుతున్నా కొంతమంది మాత్రం అవగాహన రాహిత్యంతో డబ్బు పోగొట్టుకుంటూనే ఉన్నారు. గత సంవత్సరంతో పోలిస్తే ఒక్క జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లోనే 478 కేసులు ఎక్కువగా నమోదైనట్లు పోలీసులు వెల్లడిస్తున్నారు.

ఇటీవల నమోదైన కొన్ని సైబర్ కేసులు..

- ఓ వ్యక్తి కొత్తగా ఓ బ్యాంకు నుంచి క్రెడిట్ కార్డు పొందాడు. సదరు కార్డుకు పిన్ నెంబర్ జనరేట్ చేసేందుకు గూగుల్‌లో బ్యాంక్ కస్టమర్ కేర్ నెంబర్ కోసం వెతికి ఓ నెంబర్ తీసుకున్నాడు. ఆ నెంబర్‌కు కాల్ చేయగా అవతలి వ్యక్తి తాను చెప్పినట్లు చేయాలని చెప్పగా అలానే చేశాడు. కొద్ది నిమిషాల్లోనే ఆ వ్యక్తి కార్డు నుంచి రూ.28వేలు ఉపయోగించినట్లు మేసేజ్ వచ్చింది. వెంటనే అవతలి వ్యక్తి కాల్ కట్ చేసి స్విచ్చాఫ్ చేశాడు. మోసపోయానని గ్రహించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.
- ఓ వ్యక్తి లోన్ యాప్‌లో రిక్వెస్ట్ పెట్టి రూ.3వేలు లోన్ పొందాడు. సదరు వ్యక్తికి లోన్ అమౌంట్ కట్టాలని వారం రోజులు అవ్వకముందే ఫోన్ వచ్చింది. వెంటనే రూ.7వేలు చెల్లించకుంటే నీ ఫొటోలు నగ్నంగా మార్ఫింగ్ చేసి అందరికీ పంపిస్తామంటూ బెదిరించారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.
- చిన్న మొత్తాన్ని పెట్టుబడిగా పెడితే రెండింతలు ఇస్తామని ఓ వ్యక్తి సెల్‌ఫోన్‌కు మేసేజ్ వచ్చింది. నమ్మిన వ్యక్తి రూ.200 వందలు పెట్టుబడి పెట్టాడు. మరుసటి రోజు అతని ఖాతాకు రూ.400 వందలు వచ్చాయి. ఇది నిజమేనని నమ్మి ఇలానే పెద్ద మొత్తంలో ఇన్వెస్ట్ చేశాడు. ఇక ఖాతాలోకి నగదు వచ్చినట్లు మెసేజ్ వచ్చింది. అయితే అతని ఖాతాలో ఎలాంటి సొమ్ము జమ కాలేదు. వెంటనే మోసపోయానని గ్రహించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సైబర్ నేరాల పట్ల అవగాహన ఉండాలి



గూగుల్‌లో వచ్చిన ప్రతి ఫోన్ నెంబర్ సరైందని నమ్మొద్దు. ఇంటర్నెట్ ద్వారా వచ్చే లోన్‌యాప్‌లను నమ్మి మోసపోవద్దు. ప్రతి వ్యక్తి సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలి. అత్యాశకు పోయి మోసపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎవరైనా మోసపోతే వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయండి.

– ఎం.పవన్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, జీడిమెట్ల

స్కీమ్ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి



తహసీల్దార్ సంజీవరావుకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ మండల కార్యదర్శి లక్ష్మణ్ తదితరులు

రంగారెడ్డినగర్/దుండిగల్: స్కీమ్ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీఐటీయూ కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ అన్నారు. స్కీమ్ వర్కర్లు దేశ వ్యాప్తంగా చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం కుత్బుల్లాపూర్ మండల తహసీల్దార్ సంజీవరావుకు సీఐటీయూ ఆధ్వర్యంలో స్కీమ్ వర్కర్ల డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్, జిల్లా సహాయ కార్యదర్శి బీరప్ప మాట్లాడుతూ.. అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, ఐకేపీ వీవోఏలు, సర్వ శిక్ష అభియాన్ తదితర 72 స్కీములు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆధీనంలో అమలవుతున్నాయని, వీటి అమలులో స్కీమ్ వర్కర్ల సేవలను వినియోగించుకుంటున్నా వారికి ఉద్యోగ భద్రత లేదన్నారు. ఐసీడీఎస్, మధ్యాహ్న భోజనం నిర్వహణను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించేందుకు ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని, స్కీమ్ వర్కర్లు ఐక్యంగా తమ హక్కుల సాధనకు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ నాయకులు ఈశ్వరరావు, వీరేష్, శ్రీకాంత్, కనకయ్య, సురేష్, స్కీమ్ వర్కర్ల నాయకులు ఝాన్సీ, స్వాతి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.26 వేలు చేయాలి..

దుండిగల్–గండిమైసమ్మ తహసీల్దార్ పద్మప్రియకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లింగస్వామి మాట్లాడుతూ.. స్కీమ్ వర్కర్లను పర్మినెంట్ చేసి వారికి ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయం కల్పించాలని కోరారు. పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా స్కీమ్ వర్కర్లకు రూ.26 వేల కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు రాధ, లలిత, అనిత, హంస, పార్వతమ్మ, శోభారాణి, స్వరూప, పద్మ, అశ్విని, భాగ్యలక్ష్మి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో డ్రైవింగ్.. విద్యుత్ పోల్‌ను ఢీకొట్టిన కారు



రోడ్డుపైకి ఒంగిన విద్యుత్ స్తంభం



వాహనదారులను దారి మళ్లిస్తున్న దృశ్యం

కుత్బుల్లాపూర్: మద్యం తాగి కారు నడిపిన యువకుడు విద్యుత్ పోల్‌ను ఢీకొట్టాడు. ఆ సమయంలో పెద్ద శబ్దం రావడంతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. ఈ ఘటనలో రెండు విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. విషయం తెలుసుకున్న విద్యుత్ అధికారులు వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేసి మరమ్మతులు చేపట్టారు. అర్ధరాత్రి ఒకటిన్నర సమయంలో సుచిత్ర నుంచి కుత్బుల్లాపూర్‌కు వెళ్లే రోడ్డులో గోదావరి హోమ్స్ కాలనీ మూలమలుపు వద్ద ఇన్నోవా వాహనం వేగంగా వచ్చి 11 కేవీ విద్యుత్ లైన్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టింది. దీంతో పక్కనే ఉన్న మరో స్తంభం కార్ల షోరూమ్‌పై పడింది. విషయం తెలుసుకున్న విద్యుత్ ఏఈ రవీందర్‌రెడ్డి సిబ్బందిని పంపించి ఆ లైన్ మినహా మిగతా ప్రాంతాల్లో అర్ధరాత్రి 2 గంటల నుంచి సరఫరా పునరుద్ధరించారు. శుక్రవారం ఉదయం 6 గంటలకు వాహనాలను దారి మళ్లించడంతో మధ్యాహ్నం వరకు ట్రాఫిక్ జామ్ అయ్యింది. ట్రాఫిక్ సీఐ రాజు ఇద్దరు సిబ్బందిని పంపించి ట్రాఫిక్‌ను అదుపు చేశారు. ఘటనకు కారణమైన బోయిన్‌పల్లికి చెందిన రవికిరణ్‌కు పరీక్ష చేయగా మద్యం తాగినట్లు తేలింది. కారులో ఉన్న అతడి స్నేహితులు ముగ్గురు పరారయ్యారు. తమకు నష్టపరిహారం ఇస్తే ఎలాంటి ఫిర్యాదు చేయమని విద్యుత్ సిబ్బంది, కార్ల షోరూం నిర్వాహకులు పోలీస్‌స్టేషన్ వద్ద సదరు వాహనదారుడితో బేరానికి దిగడం కొసమెరుపు.

నేడు ఉచిత వైద్య శిబిరం

సుభాష్‌నగర్: లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఎలైట్, అపోలో హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 8న సూరారం గ్రీన్ హిల్స్‌లోని శ్రీసాయి సుబ్రహ్మణ్య నిలయంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలియజేశారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగే ఈ శిబిరంలో బీపీ, డయాబెటిస్, ఇతర సాధారణ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తామన్నారు.

కోవిడ్ కేసులు నిల్

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల పరిధిలో కోవిడ్–19 నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం సూరారం కాలనీ యూపీహెచ్‌సీలో 28 మందికి పరీక్షలు చేయగా అందరికీ నెగెటివ్ రిపోర్టులు వచ్చాయని వైద్యాధికారులు తెలిపారు. దేశ వ్యాప్తంగా కరోనా కేసులు నమోదవుతున్న నేపథ్యంలో జ్వరం, దగ్గు, గొంతు నొప్పి, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్న వారు నిర్లక్ష్యం చేయకుండా కరోనా టెస్ట్ చేయించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

డీసీబీ బ్యాంక్ నూతన శాఖ ప్రారంభం

కుత్బుల్లాపూర్: రాష్ట్రంలో డీసీబీ బ్యాంక్ కార్యకలాపాలను విస్తరిస్తున్నామని డీసీబీ బ్యాంక్ లిమిటెడ్ హెడ్ నరేంద్రనాథ్ మిశ్రా అన్నారు. కొంపల్లిలోని చలిమెడ విమలాదేవి భవనంలో శుక్రవారం డీసీబీ బ్యాంక్ నూతన శాఖను మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా అడిషనల్ కలెక్టర్ అభిషేక్ అగస్త్య ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. డీబీసీ బ్యాంక్ సేవింగ్స్ ఖాతాపై 7 శాతం వరకు వడ్డీ రేట్లను అందిస్తోందని, అన్ని వర్గాల ప్రజలకు చేరువయ్యేందుకు అనేక స్కీమ్‌లు అమలు చేస్తున్నామని నరేంద్రనాథ్ మిశ్రా వివరించారు.

ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటండి

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో శుక్రవారం ఉప కమిషనర్లు, అధికారులతో కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ వి.మమత సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీల్లో ప్లాంటేషన్‌పై ఆమె మాట్లాడుతూ.. కాలనీల్లోని ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటాలని ఆదేశించారు. కాలనీ ప్లాంటేషన్, నిర్వహణను సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ సభ్యులకు కేటాయించినట్లు తెలిపారు. గ్రూపు సభ్యులకు వారు పూర్తి చేసిన పనులకు వెంటనే బిల్లులు చెల్లించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పెండింగ్ పనులు పూర్తి చేసి జోన్‌లోని పార్కుల్లో మొక్కలు నాటాలని సూచించారు. కంటి వెలుగు కార్యక్రమం నిర్వహణకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. మ్యుటేషన్, అసైన్‌మెంట్ ఫైల్స్ నిర్దేశించిన సమయంలోపు క్లియర్ చేయాలని, లేనిపక్షంలో సంబంధిత అధికారుల నుంచి పెనాల్టీ వసూలు చేస్తామన్నారు. సమావేశంలో ఉప కమిషనర్లు రవికుమార్, రవీందర్‌కుమార్, మంగతాయారు, నాగమణి, డిప్యూటీ ప్రాజెక్టు అధికారి ప్రభాకర్, ఇంద్రసేన, శ్రీనివాస్, హరిప్రియ, మధుమోహన్, కె.శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ

సుభాష్‌నగర్: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. శుక్రవారం గాజులరామారం చిత్తారమ్మ ఆలయ ప్రాంగణంలో కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో గాజులరామారం, చింతల్, సూరారం, కుత్బుల్లాపూర్, జీడిమెట్ల డివిజన్ల బీజేపీ శక్తి కేంద్రాల ఇన్‌చార్జిల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన డీకే అరుణ మాట్లాడుతూ.. ఈ నెల 7న జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో వర్చువల్‌గా జరిగే బూత్ కార్యకర్తల సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని, బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ మల్లారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు గరిగే శేఖర్ ముదిరాజ్, బావిగడ్డ రవి, బక్క శంకర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి భరతసింహారెడ్డి, డివిజన్ల అధ్యక్షులు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

అధిక ఫీజుల వసూళ్లపై ఏబీవీపీ ఆందోళన



విద్యార్థులతో మాట్లాడుతున్న ఏబీవీపీ రాష్ట్ర నాయకుడు శ్రీనాథ్

సుభాష్‌నగర్: ఏఐటీయూసీ, జేఎన్‌టీయూ నిబంధనలను తుంగలో తొక్కి అటానమస్ పేరుతో సెయింట్ మార్టిన్స్ ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులను వేధింపులకు గురిచేస్తోందని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్రీనాథ్ అన్నారు. శుక్రవారం దూలపల్లిలోని సెయింట్ మార్టిన్స్ ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏబీవీపీ మేడ్చల్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనాథ్, ఏబీవీపీ తెలంగాణ టెక్నికల్ స్టూడెంట్స్ ఫోరం కో కన్వీనర్ నగేష్ మాట్లాడుతూ.. సెయింట్ మార్టిన్స్ కళాశాల విద్యార్థులకు వేధింపుల కేంద్రంగా మారిందని, కండోనేషన్ ఫీజు, ఎగ్జామ్ ఫీజు, వివిధ రకాల ఫైన్‌ల పేరుతో విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తూ వారిని చదువుకు దూరం చేస్తోందని ఆరోపించారు. అటానమస్ పేరుతో విద్యార్థులకు ఎలాంటి రసీదు ఇవ్వకుండా వివిధ రకాల ఫీజులు వసూలు చేస్తూ విద్యతో వ్యాపారం చేస్తున్నా కళాశాల యాజమాన్యంపై జేఎన్‌టీయూహెచ్ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. అధికార పార్టీ నాయకులకు చెందిన కళాశాలలకు అధికారులు వత్తాసు పలుకుతూ విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ విషయమై ఎంతవరకైనా పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. దీంతో దిగొచ్చిన కళాశాల యాజమాన్యం వివిధ రకాల ఫీజులను వసూలు చేయమని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విష్ణు, మనీషా, మైసమ్మగూడ నగర కార్యదర్శి దినేష్, నగర సంయుక్త కార్యదర్శి వివేక్, శివ, సాయి, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంఎల్ఆర్ఐటీలో నెట్‌వర్కింగ్‌పై అవగాహన సదస్సు

దుండిగల్: దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఎల్ఆర్ఐటీ)కళాశాలలో శుక్రవారం ఇంక్యుబేషన్, నెట్‌వర్కింగ్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతుందని, అంకుర సంస్థలు, అవి నిర్వహించే కార్యకలాపాలు గణనీయంగా అభివృద్ధి చెందాయన్నారు. అందులో భాగంగానే వ్యవస్థాపకత విలువ గురించి అవగాహన కల్పించే కార్యక్రమంలో 100 మంది విద్యార్థులను భాగస్వామ్యం చేశామన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. పెద్ద ఆర్థిక వ్యవస్థల్లో సవాళ్లు, వృద్ధికి సహాయం అందించడానికి విద్యార్థులు సూచనలను చేశారని, వాటిని అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ బోర్డు సభ్యులకు ప్రమోట్ చేశామని తెలిపారు. అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ సీఈవో డాక్టర్ రామ్‌జీ పల్లెల మాట్లాడుతూ.. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం ఇలాంటి సెషన్‌లు చాలా ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, అటల్ ఇంక్యుబేషన్ ప్రతినిధి రితిక మల్లంపల్లి, ఎంఎల్ఆర్ఐటీ సీఈఈ ఇన్‌చార్జి డాక్టర్ బలరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ విద్య.. ఏ హోదా కోసం..

బడిలో ఉండాల్సిన చిన్నారులు వ్యర్థాలు ఏరుకుంటూ..



ఇనుప చువ్వలు, ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తున్న చిన్నారులు

సుభాష్‌నగర్: కూటి కోసం కోటి తిప్పలు అన్న నానుడికి ఈ చిత్రం నిదర్శనంగా చెప్పుకోవచ్చు. గాజులరామారంలోని సర్వే నెంబర్ 342లోని ప్రభుత్వ స్థలాన్ని హెచ్‌ఎండీఏకు ఇటీవల అప్పగించారు. సదరు స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించేందుకు శుక్రవారం పునాదులు తీస్తున్నారు. ఈ క్రమంలో అందులో నుంచి వెలువడిన ఇనుప చువ్వలు, ప్లాస్టిక్ వ్యర్థాలను స్థానికంగా ఉన్న కొంతమంది చిన్నారులు సేకరిస్తుండగా 'సాక్షి' కెమెరా క్లిక్ మనిపించింది.

ప్రమాదంలో కాలు కోల్పోయిన వ్యక్తికి చేయూత



భాస్కర్‌కు ఆర్థిక సహాయంతో పాటు నిత్యవసరాలు అందజేసిన బీఆర్ఎస్ నాయకులు

దుండిగల్: రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయిన బీఆర్ఎస్ కార్యకర్తకు ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, నాయకులు అండగా నిలిచారు. దుండిగల్ గ్రామం 4వ వార్డుకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కమ్మరి భాస్కర్ రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోగా ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ మేరకు శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు బాధిత కుటుంబానికి నగదు అందజేశారు. మాజీ సర్పంచ్ కావలి గణేష్ ఒక నెలకు సరిపడా నిత్యవసరాలు అందించారు. మాజీ ఎంపీటీసీ బండారి మహేష్, ఆకుల ప్రేమ్‌కుమార్, జియ్యర్ కిరణ్‌కుమార్, దొంతి మహేష్, నవీన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కుట్టు శిక్షణ ప్రారంభం



శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్

అల్విన్‌కాలనీ: యాడ్‌లైఫ్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, జీహెచ్‌ఎంసీ సహకారంతో ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని పీజేఆర్ నగర్ కమ్యూనిటీ హాలుకు మహిళా గృహ ఉపాధి పేరిట శుక్రవారం 26 కొత్త కుట్టు మెషిన్లను అందజేశారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావుతో కలిసి రిబ్బన్ కట్ చేసి ఉచిత శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. కుట్టు పని వచ్చినవారికి ఉపాధి, కొత్తవారికి శిక్షణ అందించేందుకు ఈ శిబిరాన్ని నడపాలని సూచించారు. కుట్టు మెషిన్లను అందించిన సంస్థ నిర్వాహకులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, ఉపాధ్యక్షుడు రాజేష్‌చంద్ర, కాశీనాథ్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి గుడ్ల శ్రీనివాస్, యాడ్ లైఫ్ డైరెక్టర్ డాలీ, డా.సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఇనుప స్తంభాల స్థానంలో సిమెంట్ పోల్స్ ఏర్పాటు

బాలానగర్: బాలానగర్ డివిజన్‌లో ఇనుప విద్యుత్ స్తంభాలను తొలగించి వాటి స్థానంలో సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేశారు. కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో అనేకమార్లు స్థానికులు ఇనుప స్తంభాలతో షాక్ కొడుతుందని తన దృష్టికి తీసుకువచ్చారని గుర్తుచేశారు. ఈ సమస్యను కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లగా ఆయన అధికారులతో చర్చించి శుక్రవారం సిమెంట్‌స్తంభాలను అమర్చే పనులను ప్రారంభించినట్లు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



సిల్వర్ లీఫ్ విల్లాస్‌లో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వివేకానంద్, మాజీ మంత్రి జోగు రామన్న

కుత్బుల్లాపూర్: ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తానని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. కొంపల్లి మున్సిపాలిటీ 13వ వార్డులోని నోబుల్ ఎన్‌క్లేవ్‌లో శుక్రవారం మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్, కమిషనర్ శ్రీహరి, కౌన్సిలర్ సన్న రవియాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు రోడ్డుకు ప్యాచ్‌వర్క్ చేయించాలని, కమ్యూనిటీ హాలుకు నిధులు మంజూరు చేయాలని, వర్షపు నీటి కాలువ నిర్మాణం, పార్క్ స్థలానికి అదనంగా స్థలం కేటాయించాలని ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాల్సిందిగా అధికారులను ఆదేశించారు.

- కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు సిల్వర్ లీఫ్ విల్లాస్‌లో మాజీ మంత్రి, ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్నతో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా భూగర్భ డ్రైనేజీ, వరద నీటి నాలా, సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని స్థానికులు వారి దృష్టికి తీసుకురాగా సానుకూలంగా స్పందించారు. వైస్ చైర్మన్ గంగయ్య నాయక్, కోఆప్షన్ సభ్యుడు వెంకటేష్, డీఈఈ చిరంజీవి, కౌన్సిలర్లు పూజారి వసంత, సువర్ణ, సంజుయాదవ్, పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రాజు, సీనియర్ నాయకులు బూరుగుబావి హనుమంతరావు, పీఏసీఎస్ డైరెక్టర్ బూరుగుబావి సత్యనారాయణ, నాయకులు దేవేందర్ యాదవ్, లక్ష్మణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.
- దూలపల్లి తుమర్ చెరువును ఎమ్మెల్యే వివేకానంద్ అధికారులతో కలిసి సందర్శించారు. వర్షాకాలంలో భారీ వర్షాలకు తుమర్ చెరువు నిండి ఇబ్బందులు ఎదురవుతున్న దృష్ట్యా దిగువన ఉన్న లింగయ్య చెరువులోకి వర్షపు నీరు సాఫీగా చేరేలా అనుసంధానం చేస్తూ కెనాల్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. దుండిగల్–గండిమైసమ్మ తహసీల్దార్ పద్మప్రియ, ఏఈఈ సారా తదితరులు పాల్గొన్నారు.